సాక్షి
నంద్యాల
బుధవారం । 1 । మార్చి । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు మంగళవారం 1,730 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు.

ఎర్ర బంగారం మెరిసేలా..

- సాకారమవుతున్న మిర్చి రైతుల కల
- రేపు నంద్యాలలో మిర్చి యార్డు ప్రారంభం
- ఐటీసీ సంస్థతో కుదిరిన ఒప్పందం
- 8 మంది వ్యాపారులకు లైసెన్స్‌లు మంజూరు
- ఉమ్మడి జిల్లాలో పెరగనున్న కోల్డ్ స్టోరేజ్‌లు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడద నుంచి పంటలను కాపాడుకోవడం రైతుకు ఎంత కష్టమో.. చేతికొచ్చిన దిగుబడిని మార్కెట్‌కు తరలించి అమ్ముకోవడం కూడా అంతే కష్టం. గత పాలకులు రైతుల సంక్షేమాన్ని విస్మరించడంతో దశాబ్దాలుగా మిర్చి రైతులు కష్టనష్టాలను చవిచూస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడి ఇచ్చిన హామీ మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లా మిర్చి రైతుల సౌకర్యార్థం మిర్చి మార్కెట్ యార్డును అందుబాటులోకి తెస్తున్నారు. నంద్యాల కేంద్రంగా గురువారం యార్డును ప్రారంభించనుండటంతో రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆరబోసిన మిరప పంట



నంద్యాలలోని టెక్కె మార్కెట్ యార్డు ప్రాంగణం

నంద్యాల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా దాదాపు 35 వేల హెక్టార్లలో పైగా రైతులు మిర్చి సాగు చేస్తారు. అయితే దిగుబడిని అమ్ముకోవడానికి గుంటూరు మిర్చి యార్డు, కర్ణాటకలోని బ్యాడిగ మిర్చి మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఏటా ఎంతో మంది రైతులు వ్యయప్రయాసలు పడుతుండటంతో నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు తెరపైకి వచ్చింది. ఈ విషయాన్ని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన సీఎం నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ కార్యదర్శి ప్రద్యుమ్నాకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మార్చి 2వ తేదీన మిర్చి యార్డు ప్రారంభించేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. నంద్యాల పట్టణంలో 17 ఎకరాల్లో విస్తరించి ఉన్న టెక్కె మార్కెట్‌యార్డులో మిర్చి యార్డును ఏర్పాటు చేయాలని మార్కెటింగ్, హార్టికల్చర్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మార్కెటు యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, యార్డు కార్యదర్శి కల్పన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రైతులు, కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు, వ్యాపారులతో రెండు విడతలుగా సమావేశాలు నిర్వహించారు. అలాగే మిర్చియార్డులో పంట కొనుగోలు చేసే 8 మంది వ్యాపారులకు లైసెన్స్‌లు మంజూరు చేశారు. రైతులు తీసుకొచ్చే పంటను లైసెన్స్ కలిగిన వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అన్ని రకాల మిరప పంటను బహిరంగ వేలం ద్వారా వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మిర్చి హబ్‌గా మారనున్న నంద్యాల...

మిర్చియార్డు ప్రారంభం అయితే నంద్యాల పట్టణం మిర్చి హబ్‌గా మారనుంది. ఉమ్మడి జిల్లా రైతులే కాకుండా అనంతపురం, కడప, ప్రకాశం, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాల రైతులు కూడా నంద్యాలలో పంటను అమ్ముకునేందుకు వస్తారు. జిల్లాలో ఇప్పటికే 23 కోల్డ్ స్టోరేజ్‌లు ఉండగా, వాటి సంఖ్య మరింత పెరగనుంది. అలాగే హమాలీలకు, లారీ డ్రైవర్లకు పనులు దొరకడం, కమీషన్ వ్యాపారులు, రైతులతో నంద్యాల మార్కెట్‌యార్డు కిటకిటలాడే అవకాశం ఉంది. మిర్చి వ్యాపారం ఏడాదికి రూ.500 కోట్ల మేర టర్నోవర్ జరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

యార్డు ఏర్పాటు చేస్తే కింది కష్టాలు తొలిగినట్లే.

- ✓ మిర్చి పంట విక్రయానికి తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు తరలించాలి. అక్కడ కమీషన్ ఏజెంట్లకు రూ.లక్షకు రూ.3 వేలు చెల్లించాలి.
- ✓ ధర వచ్చేంత వరకు మూడు, నాలుగు రోజులు అక్కడే వేచి ఉండాలి, నాలుగో రోజు ధర రాకపోతే వచ్చిన కాటికి అమ్ముకోవాలి.
- ✓ ధర రాకపోతే గుంటూరు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేయాలంటే బస్తాకు అదనంగా రూ.20 చెల్లించాలి.
- ✓ మిర్చిని తీసుకెళ్లడానికి లారీకి రూ.20 వేలు ఖర్చు. మూడు రోజులు ఆగితే 60 వేలు బాడుగకే ఖర్చు అవుతుంది.
- ✓ హోటళ్లు, భోజన ఖర్చులు భరించడంతో పాటు రోజుల తరబడి రైతులు వేచి ఉండాలి.

గతేడాది జిల్లాలో మిర్చి సాగు, దిగుమతి వివరాలు

నియోజకవర్గం	సాగు (హెక్టార్లలో)	దిగుమతి (మెట్రిక్ టన్నుల్లో)
నంద్యాల	1,487	8,922
ఆళ్లగడ్డ	1,407	8,442
బనగానపల్లె	4,593	27,558
పాణ్యం	1,836	11,020
శ్రీశైలం	963	5,779
నందికొట్కూరు	2,143	12,861
డోన్	107	642
ఆదోని	2,100	12,599
ఆలూరు	4,651	27,911
కోడుమూరు	1,545	9,270
కర్నూలు	1,222	7,336
మంత్రాలయం	5,947	35,683
పత్తికొండ	1,115	6,693
ఎమ్మిగనూరు	5,516	33,096
మొత్తం	34,636	2,07,817

అనుమతులు వచ్చాయి



నంద్యాల ప్రాంత రైతులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ త్వరలో నెరవేరుతోంది. మార్చి2వ తేదీ నుంచి నంద్యాల మార్కెట్‌యార్డులో మిర్చి యార్డును ప్రారంభించి కొనుగోలు చేస్తాం. మిర్చియార్డుకు సంబంధించి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు, వ్యాపారులు, రైతులతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించాం. మిర్చి వ్యాపారులకు లైసెన్స్‌లు మంజూరు చేశాం.

– మహేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్, నంద్యాల

రైతులకు ఎంతో ఉపయోగకరం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిరప సాగు చేసే రైతులు దిగుబడిని అమ్ముకోవడానికి గుంటూరుకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిర్చి యార్డు నంద్యాలలో ఏర్పాటు అయితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కర్నూలు, నంద్యాల జిల్లా రైతులే కాకుండా అనంతపురం, కడప, ప్రకాశం, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ జిల్లా రైతులు కూడా మిర్చి అమ్మకాలకు నంద్యాలకు వచ్చేఅవకాశం ఉంది.

– కల్పన, మార్కెట్ యార్డు కార్యదర్శి, నంద్యాల

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మిర్చి సాగుకు పెట్టుబడి చాలా అధికం. చేతికొచ్చిన పంటను సకాలంలో కాపాడుకుని విక్రయిస్తే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు అయితే రైతులకు ఖర్చు చాలా తగ్గడమే కాకుండా పంటకు గిట్టుబాటు ధర వచ్చినప్పుడే అమ్ముకునే అవకాశం ఉంటుంది. నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మిర్చి రైతులు రుణ పడి ఉంటారు.

– వెంకటసుబ్బారెడ్డి, మిర్చి రైతు, పాండురంగాపురం, నంద్యాల మండలం

న్యూస్‌రీల్

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

నంద్యాల(రూరల్): ప్రతి ఒక్కరు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ సమన్వయకర్త కె.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆదేశాలతో మంగళవారం చాపిరేవుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వస్తువులను తయారు చేసి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో సైన్స్ నమూనాలు, ప్రాజెక్టులు రూపొందించడం ద్వారా శాస్త్ర పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవయ్య, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, ప్రమీల, రమాదేవి, రఫీ, సుధాకర్, చంద్రమోహన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించండి



మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

నంద్యాల(అర్బన్): కుష్టువ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వైద్యం అందించాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఎన్‌జీఓస్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో లెప్రసీ వ్యాధి గుర్తింపుపై వైద్యాధికారులు, ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ అర్బన్ హెల్త్ సెంటర్ల సిబ్బందితో కుష్టువ్యాధి సోకిన వారిని గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యాధి కారకాలైన క్రిములు తుమ్మడం, దగ్గడం వల్ల వ్యాప్తి చెందుతాయని, వ్యాధి లక్షణాలు 5, 7 ఏళ్ల వరకు గుర్తించలేమన్నారు. చర్మంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, లావుగా మారిన, నొప్పితో కూడిన నరాలు, కాళ్లు, చేతులు, కండరాళ్ల బలహీనత తదితర లక్షణాలను గుర్తించి వ్యాధి తీవ్రతను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రభావతి, జయచంద్రారెడ్డి, కాంతరావు, గంగాధర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఎంఓ తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఈఓ మరో ఏడాది కొనసాగింపు



కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానంది దేవస్థానం ఈఓగా కాపు చంద్రశేఖర్‌రెడ్డిని మరో ఏడాది పాటు అదే స్థానంలో కొనసాగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవస్థానం కార్యాలయానికి ఉత్తర్వులు అందినట్లు మంగళవారం కార్యాలయ వర్గాలు తెలిపాయి. గత ఏడాది ఫిబ్రవరిలో మహానంది ఈఓగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

మార్కెట్ చెక్‌పోస్టుల తనిఖీలకు శ్రీకారం



మార్కెట్ కమిటీ చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన చెక్‌పోస్టుల్లో 24 గంటల పాటు మహా చెక్‌కు మార్కెటింగ్ శాఖ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 12 చెక్‌పోస్టుల్లో ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, మంత్రాలయం, కోసిగి, ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్ యార్డులకు చెందిన చెక్ పోస్టుల్లో తనిఖీలు చేశారు. బుధవారం ఉదయం వరకు మహా చెక్ జరుగుతుంది. మార్కెట్ కమిటీల ఆదాయం పక్కదారి పట్టకుండా చూడటమే మహా చెక్ ఉద్దేశమని ఏడీ నారాయణమూర్తి తెలిపారు. చెక్‌పోస్టుల తనిఖీలకు మరోవైపు రెండు విజిలెన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

జగమేలు నాయక.. జగదానందకారక



హనుమంతుడి వాహనంపై విహరిస్తున్న జ్వాల నరసింహస్వామి



సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు



ఎగువ అహోబిలంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- హంస, సూర్యప్రభ వాహనాలపై దర్శనమిచ్చిన ప్రహ్లాదవరదుడు
- హనుమంత వాహనంపై ఊరేగిన జ్వాల నరసింహుడు

ఆళ్లగడ్డ: అహోబిల దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దిగువ అహోబిలంలో ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం తెల్లవారుజామున నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో ఉన్న హంస వాహనంపై స్వామి వారిని కొలువుంచి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో మాడవీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి అహోబిల మఠం చేరుకున్న హంస వాహనాధీశుడైన అహోబిలేశునికి మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజయతీంద్ర మహాదేశికన్ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామి తిరిగి దేవాలయం చేర్చారు. అక్కడ అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో స్వామికి హారతి ఇచ్చి ప్రత్యేక మండపంలో స్వామివారిని కొలువుంచారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను యాగశాలలో కొలువుంచి పంచామృతాభిషేకం, జలాభిషేకం నిర్వహించి పట్టు పీతాంబరాలతో అలంకరించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై శ్రీ ప్రహ్లాదవరదస్వామి కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

ఎగువ అహోబిలంలో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు మంగళవారం ఉదయం ఎగువ అహోబిలంలో కొలువైన శ్రీ జ్వాలనృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నృసింహ గరుడ విమాన వాహన సేవ చేపట్టి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి మండపంలో కొలువుంచారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై శ్రీ జ్వాలనరసింహస్వామి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజల్లో జీపీఏ సంపత్, ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సామ్యానారాయణ్, మేనేజర్ శ్రీనివాసన్, ప్రత్యేకాధికారి శేతురామన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేటి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

- ఉమ్మడి జిల్లాకు రూ.126.32 కోట్లు
- ఆధార్ ముఖ గుర్తింపు ద్వారా కూడా పింఛన్ల పంపిణీ
- ఉదయం 5 గంటల నుంచే మొదలు



కర్నూలు(అగ్రికల్చర్): ఒకటో తేదీ వస్తుందంటే చాలు.. ముంగిట్లో ఆనందం ఎదురొస్తుంది. వైఎస్సార్ పెన్షన్ కానుకను గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటికే వచ్చి నగదు అందిస్తుంటే లబ్ధిదారుల ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది. మార్చి నెల పింఛన్లను 1 నుంచి 5వ తేదీ వరకు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.126.32 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను సంబంధిత బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య స్పష్టం చేశారు. టీడీపీ పాలనలో పింఛను పొందాలంటే గ్రామ పంచాయతీలు, రచ్చ బండల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ బాధలను తొలగించింది. ఇంటి వద్దకే పింఛను నడిచి వస్తోంది. కర్నూలు జిల్లాలో 2,39,026 పింఛన్లకు రూ.66.44కోట్లు, నంద్యాల జిల్లాలో 2,16,981 పింఛన్లకు రూ.59.87 కోట్లు పంపిణీ చేయడానికి డీఆర్‌డీఏ–వైకేపీ ఏర్పాట్లు చేసింది.

ముఖ గుర్తింపు ద్వారా కూడా పింఛన్ల పంపిణీ..

బయోమెట్రిక్ ద్వారా పింఛన్‌లు పంపిణీ చేస్తున్నారు. వేలిముద్రలు పడకపోతే ఐరీస్ ఆధారంగా అందిస్తారు. మార్చి నుంచి వేలిముద్రలు, ఐరీస్ ఫెయిల్ అయితే ఆధార్ ఆధారంగా ముఖ గుర్తింపుతోనూ పింఛను పంపిణీ చేయనున్నారు. ఇది కూడా వీలుకాని పక్షంలో మూడో రోజు నుంచి ఆర్‌బీఐఎస్ యాప్ ద్వారా పింఛనుదారుల ఫొటో తీసి పింఛను సొమ్ము ముట్టజెప్పనున్నారు.

ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న లే అవుట్లలో రూఫ్, ఆర్‌సీ స్థాయిలో ఉన్న 4,400 ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఏపీ సేవా సర్వీసులు, గృహ నిర్మాణాల పురోగతి, ఉపాధి కూలీల పెంపు తదితర అంశాలపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజువారీ లక్ష్యంలో భాగంగా ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు కేటాయించిన 964 ఇళ్ల లక్ష్యానికిగాను 326 పూర్తి చేశారని మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను బేస్మెంట్ స్థాయికి, బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను రూఫ్ స్థాయికి, రూఫ్ స్థాయిలో ఉన్న ఇళ్లను పూర్తి స్థాయి దశలో స్టేజ్ కన్వర్షన్‌కు తీసుకువచ్చి బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు త్వరితగతిన మెరుగైన సేవలు అందించాలన్నారు. జగనన్న తోడు కింద లబ్ధిదారులను గుర్తించి సంబంధిత జాబితాను బ్యాంకర్లకు అందజేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులకు ఎస్టిమేట్ ప్రతిపాదనలు సమర్పించడంతో పాటు చేపట్టిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కింద 40 శాతం పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీని పూర్తి చేయించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు తీసుకున్న వాళ్లు పనులకు వచ్చేలా చర్యలు తీసుకొని లేబర్ రిపోర్ట్‌ను పెంచాలని డ్వామా పీడీకి సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, హౌసింగ్ ఈఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలకు సిఫార్సు

కర్నూలు(రాజ్‌విహార్): విధుల పట్ల నిర్లక్ష్యం వహించి తప్పుడు కనెక్షన్లు ఇచ్చి, వినియోగదారుడిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన కేసులో మరి కొంత మంది విద్యుత్ అధికారులపై చర్యలకు సిఫార్సులు వెళ్లాయి. 20 కిలో వాట్స్ విద్యుత్ లోడు ఉన్న త్రీఫేజ్ కనెక్షన్‌కు సీటీ మీటర్ (24 గంటల్లో ఏ గంటకు ఎన్ని యూనిట్లు వాడారో లెక్క చూపుతుంది)ను అమర్చాలి. ఇది మీటర్స్ అండ్ ప్రొటెక్షన్ ఈఈ, డీఈఈల పర్యవేక్షణలో జరగాలి. అయితే గతంలో ఆదోనిలోని ఓ వినియోగదారుడికి ఈ మీటర్‌ను అమర్చడంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో సీటీ మీటర్స్ విభాగంలో పనిచేస్తున్న, ప్రస్తుత కర్నూలు రూరల్స్ ఏఈ అంజనేయ శాస్త్రితో పాటు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మరో ఏఈ అనిల్‌కుమార్‌పై సోమవారం సస్పెన్షన్ వేటు పడింది. ఇదే అంశంలో ఎంఅండ్‌పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల వైఫల్యాలు, లోపాలను వివరిస్తూ వారిపై కూడా చర్యలు తీసుకోవాలని మంగళవారం తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి నివేదికలు పంపినట్లు సమాచారం.

రైతు సంక్షేమమే ధ్యేయం



రైతులకు చెక్కును అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తదితరులు

- మూడో విడత రైతు భరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు విడుదల
- జిల్లాలో 2,21,241 మంది రైతులకు రూ.46.88 కోట్లు జమ
- తెనాలి నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన సీఎం

నంద్యాల: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. నాల్గవ ఏడాది రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద మూడో విడత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరు జిల్లా తెనాలి నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రైతులు, వ్యవసాయాధికారులు వీక్షించారు. జిల్లాలో ఈ పథకం కింద 2,13,929 మంది రైతులకు రూ.44.74 కోట్లు, 6,857 మంది కౌలు రైతులకు రూ.2.5 కోట్లు, 455 మంది ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతులకు రూ.9.10 లక్షలు.. మొత్తం 2,21,241 మంది రైతులకు రూ.46.88 కోట్లు నగదు జమ చేశారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 45.955 రైతులకు రూ.9.86 కోట్లు, బనగానపల్లె నియోజకవర్గంలో 42,180 మందికి రూ.8.92 కోట్లు, డోన్ నియోజకవర్గంలో 35,648 మందికి రూ.7.52 కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గంలో 39,962 మందికి రూ.8.43 కోట్లు, నంద్యాల నియోజకవర్గంలో 15,329 మందికి రూ.3.22 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలో 14,911 మందికి రూ.3.70కోట్లు, శ్రీశైలం నియోజకవర్గంలో 27,256 మంది రైతులకు రూ.5.86 కోట్లు వారి ఖాతాల్లో సీఎం బటన్ నొక్కి నగదు జమ చేశారు. మాండూస్ తుఫాన్ కింద పంట నష్టపోయిన 1,966 మంది రైతులకు రూ.162.53 లక్షలు వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా రైతులకు చెక్కును అందజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా సీఎం ఆదుకుంటున్నారన్నారు. ఆర్బీకేలు, ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చి రైతులకు అండగా నిలిచారన్నారు. ప్రభుత్వం అందించే రైతు భరోసా సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

భానుముక్కల పరిసరాల్లో పులి సంచారం

పాములపాడు: మండలంలోని భానుముక్కల గ్రామ సమీపంలో మంగళవారం పులి కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజులుగా ఆత్మకూరు మండలం కరివేన, నల్లకాల్వ గ్రామాల పరిసరాల్లో కనిపించిన పులి మంగళవారం భానుముక్కల పరిసర ప్రాంతాల్లో ఓ మహిళకు కనిపించింది. దుస్తులు ఉతుక్కునేందుకు చాకిరేవు వద్దకు మహిళ వెళ్తుండగా కుంట వద్ద పులి కనిపించింది. భయాందోళనతో మహిళ గట్టిగా కేకలు వేస్తూ పరుగులు తీయడంతో అటుగా వెళ్తున్న మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తులు, సమీపనంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు అక్కడికి చేరుకుని కేకలు వేయడంతో పులి అడవి వైపు వెళ్లినట్లు సమాచారం. ఈ విషయం గ్రామంలో తెలియడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహానందీశ్వరుడికి రూ.48.76 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: హుండీ కానుకల ద్వారా మహానందీశ్వరుడికి రూ.48.76 లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అభిషేక మండపంలో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వర, కోదండరామాలయం, ఆంజనేయ, వినాయకనంది ఆలయాల ద్వారా రూ.47,84,402, అన్నదాన విభాగం ద్వారా రూ.66,027, గోశాల ద్వారా రూ.26,289 ఆదాయం వచ్చిందన్నారు. వీటితో పాటు యూఎస్ఏ, యూఏఈ, కత్తర్, ఆస్ట్రేలియా దేశాల కరెన్సీ లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు, ధర్మకర్త బుసకాని వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబర్ 2022లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య సి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు rayalaseema university.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మార్చి 6వ తేదీ వరకు రీవాల్యుయేషన్‌కు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 11,270 మంది హాజరు కాగా 4,578 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 5,171 మందికి 1,679 మంది, నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 12,361 మందికి 5,371 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

కొండ ప్రశ్నించదని.. అధికారులకు కళ్లు లేవని..!



మట్టి తరలింపునకు క్లస్టర్ యూనివర్సిటీ కంచె తొలగించిన దృశ్యం




టిడ్కో ఇళ్ల సమీపంలో కొండను పూర్తిగా తవ్వి మట్టి తరలించడంతో మిగిలిన గుంతలు

జగన్నాథ గట్టు.. మతసామరస్యానికి ప్రతీకగా ఆంజనేయస్వామి విగ్రహం, ఆ పక్కనే దర్గా కనిపిస్తుంది. ఎత్తయిన ఈ కొండ నగర శివారులో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇప్పుడు ఈ చుట్టు పక్క ప్రాంతమంతా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం, ఇక్కడే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరుగుతుండటంతో జనజీవనానికి అనువుగా మారింది. ఇటీవల రింగ్ రోడ్డు కూడా పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు అధికమై నివాస ప్రాంతాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వెంచర్లు వేసిన రియల్టర్ల కన్ను జగన్నాథ గట్టుపై పడింది. ఆంజనేయస్వామి అడగడు అనుకున్నారో.. అధికారులు మనోళ్లే అని భావించారో.. ఏకంగా కొండనే తవ్వడం మొదలు పెట్టారు. పేదలకిచ్చిన పొలాలను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు.. ఆ పక్కనే ఉన్న కొండను, ఖాళీ స్థలాన్ని తవ్వి తమ స్థలంలో కలిపేసుకోవడం మొదలు పెట్టారు. ఇక టిడ్కో ఇళ్లకు ఎదురుగా ఒకప్పుడు కొండ ఉండేది అన్నట్లుగా తవ్వకాలు చేయడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. ఇంకొద్ది రోజులు పోతే అంజన్న స్వామి కొండ దిగిరాక తప్పదన్నట్లుగా తవ్వకాలు రేయింబవళ్లు కొనసాగిస్తుండటం నగర ప్రజల గుండెలను పిండేస్తోంది.

– ఫొటోలు: డి.హుస్సేన్



ఆంజనేయుడే నిలువెత్తు సాక్ష్యంగా తవ్వకం



ఓ ప్రయివేట్ వెంచర్ దాటుకొని కరిగిపోతున్న కొండ



రింగు రోడ్డు పక్కనే దర్జాగా చదును చేస్తూ..

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



మృతి చెందిన కంబయ్య

కొలిమిగుండ్ల: బెలుం ఎస్సీ కాలనీకి చెందిన గని కార్మికుడు బండెల కంబయ్య (35) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కంబయ్య రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం నాపరాతి గనిలో పనికి వెళ్లాడు. విద్యుత్ కోత మిషన్‌తో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. తోటి కార్మికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్కడే పని చేస్తున్న మరో కార్మికుడు దిలీప్ గాయాలతో బయట పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న బోయ ఎర్రమల

కర్నూలు : కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన బోయ ఎర్రమల (36) కుటుంబ సమస్యల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఈయన భార్య ఉపాధి నిమిత్తం కొన్నాళ్ల క్రితం గుంటూరు వెళ్లింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కుటుంబ సమస్యల కారణంగా మంగళవారం మధ్యాహ్నం దూపాడు దగ్గర ట్రాక్ మెయింటెనెన్స్ ఇంజన్ వెళ్తుండగా ఎదురెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

పాణ్యం: కందికాయపల్లె గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో కొండల్లో గుర్తు తెలియని వ్యక్తి శవం ఉందని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయస్సు, ఐదు అడుగు ఎత్తు ఉండి తెల్లటి బనియన్, గ్రే కలర్ డ్రాయర్ ధరించినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9121101096కు సమాచారం అందించాలన్నారు.

నిర్లక్ష్యానికి రెండు ప్రాణాలు బలి

- నూర్పిడి యంత్రం బోల్తా పడి ఇద్దరు కూలీలు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- త్రుటిలో తప్పించుకున్న మరో ముగ్గురు
- కుమారుడితో వాహనాన్ని నడిపించిన డ్రైవర్
- శాతనకోటలో విషాదం



నాగలక్ష్మమ్మ (ఫైల్)



అనురాధ (ఫైల్)

జూపాడుబంగ్లా: వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలు మరో అర గంటలో ఇంటికి చేరాల్సి ఉండగా ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి బలయ్యారు. నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాతనకోట గ్రామానికి చెందిన తెలుగు నాగలక్ష్మమ్మ(46), జి.అనురాధ(30) ఖాజాబీ, శివలక్ష్మమ్మ, రాధమ్మ, నూరాణి అదే గ్రామానికి చెందిన వెంకటస్వామి అనే రైతు మినుము పంటను నూర్పిడి చేసేందుకు వెంకటేశ్వర్లుకు చెందిన నూర్పిడి యంత్రాన్ని ట్రాక్టర్‌కు తగిలించుకొని పొలానికి వెళ్లారు. నూర్పిడి పనులు ముగించుకొని ట్రాక్టర్, నూర్పిడియంత్రంతో వ్యవసాయ కూలీలు ఇళ్లకు బయలుదేరారు. మరో అరగంటలో ఇళ్లకు చేరుకోవాల్సి ఉండగా డ్రైవర్ వెంకటేశ్వర్లు మైనర్ అయిన కుమారుడి చేత వాహనాన్ని డ్రైవింగ్ చేయించారు. వేగాన్ని అదుపు చేయకపోవడంతో నూర్పిడి యంత్రం బోల్తా పడింది. దానిపై కూర్చున్న నాగలక్ష్మమ్మ, అనురాధ అక్కడికక్కడే మృతి చెందగా ఖాజాబీకి కాలు విరిగింది. ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న శివలక్ష్మమ్మ, రాధమ్మ, నూరాణి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ ఓబులేసు, పట్టణ రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి సంఘటన ప్రాంతానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు, అతని కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలకు నందికొట్కూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చేయడంతోపాటు అండగా ఉంటానని భరోసా నిచ్చారు.

కుమారుడి పెళ్లి చూడకుండానే..

మృతురాలు నాగలక్ష్మమ్మకు భర్త పరశురాముడు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, పెద్ద కుమారుని వివాహం ఇటీవల నిశ్చయమైంది. ఈ వేసవిలో



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

ముహూర్తం నిర్ణయించి పెళ్లి పనులు మొదలు పెట్టారు. కాగా కుమారుని పెళ్లి చూడకుండా నాగలక్ష్మమ్మ మృతిచెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు.

తల్లిని కోల్పోయి.. తల్లడిల్లి



తల్లిని కోల్పోయిన ముగ్గురు కుమారులు

మృతురాలు అనురాధకు భర్త నరసింహులు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పిల్లలందరూ పదేళ్లలోపు వారే. తల్లి మృతదేహంపై పడి వారు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. అమ్మా.. లేమ్మా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతులిద్దరూ వరుసకు అక్కాచెల్లెళ్లు కావడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. నిత్యం వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ సరదాగా ఉండే ఇద్దరు మహిళలు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వేసవిలో తాగు నీటి ఎద్దడి రానివ్వొద్దు

- పారిశుధ్య చర్యలపైనా దృష్టి సారించండి. • జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: వేసవి సమీపిస్తుండటంతో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో తాగునీటి సరఫరా, పబ్లిక్ హెల్త్, పారిశుధ్య చర్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ చూసినా పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపాలిటీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. వీధుల్లో పందులు, కుక్కల బెడద నివారణకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. నంద్యాల పట్టణానికి కేసీ కెనాల్ వెలుగోడు రిజర్వాయర్, డోన్ పురపాలక సంఘానికి గాజులదిన్నె ప్రాజెక్ట్, నందికొట్కూరు మున్సిపాలిటీకి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆళ్లగడ్డ నగర పంచాయతీకి గండలేరు రిజర్వాయర్, ఆత్మకూరు మున్సిపాలిటీకి వెలుగోడు రిజర్వాయర్, బేతంచెర్ల నగర పంచాయతీకి గ్రౌండ్ వాటర్ (పవర్ బోర్ వెల్స్)కు సంబంధించి పైపులైను లీకేజీ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయడంతో పాటు 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ఇక మురుగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీఓ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న అటవీ శాఖ రేంజర్ సూర్యచంద్రరాజు

కర్నూలు కల్చరల్: వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అటవీ అధికారి శివశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగర వనంలో కృష్ణవేణి ఐటీఐ కళాశాల విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ ఏ ప్రాణికి అపాయం తలపెట్టకూడదన్నారు. అడవులను, అడవి జాతులను రక్షించుకోవాలన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ పర్యావరణ సమతుల్యానికి ఎంతో ముఖ్యమన్నారు. ఏపీ స్టేట్ ఎనిమల్ వెల్ఫేర్ బోర్డు మెంబర్, స్నేక్ రెస్క్యూయర్ మహమ్మద్ ఇద్రిస్ జిల్లాలోని వివిధ వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. పాముల జీవన విధానం, రకాలు, వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు జయమ్మ, శకుంతలమ్మ, రేణుక, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్షణ!

- పశువులకు సోకే ప్రమాదకర వ్యాధి గాలికుంటు
- ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించడం అవసరం
- నేటి నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమం



పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రవిబాబు

కర్నూలు (అగ్రికల్చర్): పశువుల విలువ అపారంగా పెరిగింది. వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటే పాడి, వ్యవసాయంలో రాణించవచ్చు. అలాంటి పశువులకు సోకే వ్యాధుల్లో ప్రమాదకరమైంది గాలికుంటు. వేగంగా గాలి ద్వారా వ్యాపించే ఈ వ్యాధి వైరస్ ప్రస్తుతం లేకపోయినా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అనుమానం కలిగిన వెంటనే వ్యాధి సోకని ప్రాంతాల్లో కూడా నివారణ చర్యలు చేపట్టాలి. లేకపోతే పశువుల ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు కొన్ని సార్లు పశు మరణాలు జరిగే ప్రమాదం లేకపోలేదు.

వ్యాధి లక్షణాలు ఇలా..

- శరీర ఉష్ణోగ్రత 104-1-6 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు ఉంటుంది. నోటి ఎపిథీలియా, పళ్ల చిగుళ్లు, నాలుక, ముట్టె, లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికి పోతాయి. తర్వాత గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి నొప్పి కలగడం ద్వారా పశువులు సరిగా నడవలేక కుంటుతుంటాయి. ఒక్కోసారి పొదుగుపై బొబ్బలు ఏర్పడి వాపు సంభవిస్తుంది. బాక్టీరియా బొబ్బలను ఆశించడం వల్ల చీముతో కూడిన పుండ్లు తయారై చిరాకును కలిగిస్తాయి.
- వ్యాధి సోకిన పశువుల పాలు దూడలు తాగితే మరణిస్తాయి. పాడిపశువుల్లో పాల ఉత్పత్తి ఆకస్మాత్తుగా తగ్గుతుంది. చూలి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.
- వ్యాధిగ్రస్త పశువులు 2,3 రోజుల్లో మేత తినడం ప్రారంభించినా వ్యాధి కలిగించే దుష్ఫలితాల నుంచి కోలుకోవడానికి ఆరు మాసాలు పడుతుంది.

నివారణ ఇలా... : ప్రస్తుతం గాలికుంటు వ్యాధి లేదు. 2015లో అక్కడక్కడ కేసులు కనిపించాయి. తర్వాత గాలికుంటు కేసులు ఎక్కడా నమోదు కాలేదు. ఈ వ్యాధికి చికిత్స వ్యయ ప్రయాసతో కూడుకున్నందున నివారణ మార్గాలపై శ్రద్ధ వహించాలి. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఏడాదికోసారి క్రమం తప్పకుండా వేయించాలి. టీకాలు వేసిన తర్వాత 1-3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది ఏడాది పాటు వ్యాధి సోకకుండా కుంటుంది. నిండు చూడిగా ఉన్న పశువులను ఈనిన తర్వాత టీకాలు వేయిస్తే మంచిది. ఈ వ్యాధి అన్ని కాలాల్లో కనిపిస్తుంటుంది. అందువల్ల ప్రతి ఏటా పశువులకు అన్ని వైరస్ స్ట్రెయిన్‌లతో కూడిన టీకాలు వేయించాలి.

నేటి నుంచి టీకాలు... : గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఏటా జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి జిల్లాలో నల్ల, తెల్ల జాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేసింది. కర్నూలులోని ఉమ్మడి జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం నుంచి కర్నూలు జిల్లాకు 3,25,800 డోసులు, నంద్యాల జిల్లాకు 3,72,550 డోసుల వ్యాక్సిన్ ఇప్పటికే సరఫరా అయింది. కర్నూలు జిల్లాలోని కర్నూలు డివిజన్‌కు 1,79,800 డోసులు, ఆదోని డివిజన్‌కు 1,46,000, నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ డివిజన్‌కు 1,60,850 డోసులు, నంద్యాల డివిజన్‌కు 2,11,700 డోసుల ప్రకారం సరఫరా చేసినట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు తెలిపారు.

పట్టుబడిన గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న పోలీసు అధికారులు

బొమ్మలసత్రం: జిల్లా పరిధిలో పట్టుబడిన గంజాయిని డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ మెంబర్ ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ రామాంజినాయక్ ఆధ్వర్యంలో దహనం చేశారు. నంద్యాల టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్‌డీపీఎస్ కేసుల్లో 720గ్రాములు, పాణ్యం పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో 20,780 కేజీల సీజ్ చేసిన రూ. 7 లక్షల విలువైన గంజాయిని మంగళవారం స్థానిక విజయడెయిరీ సమీపంలో పోలీసులు కాల్చివేశారు.